EENADU

Date 30-1-1988

# కొత్తఆశ 'అంజీర'

అనంతపురం, జనవరి 29 (న్యూస్‌టుడే): గణేష్ దానిమ్మలో అధికదిగుబడి సాధించిన ఆదర్శరైతు గొంది పాండురంగయ్య అంజీర (అత్తిపండు), పాల్సా అనే పండ్ల మొక్కలను కూడా నాటి విజయం సాధించారు. నీటి ఎద్దడిని తట్టుకుని సంవత్సరకాలంలో మంచి దిగుబడిని చ్చే అంజీరను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దగ్గరున్న తన తోటలో నాటి ఈ ఏడాది పాండురంగయ్య మంచిదిగుబడి సాధించారు. మిగిలిన ఫలవృక్షాలు చీనీ, ద్రాక్ష, దానిమ్మలవలే కాక ఈ చెట్ల వేర్లు భూమిలోకి బాగా లోతుకి వెళ్ళగలవు. ఫలితంగా నీటిఎద్దడిని కూడా తట్టుకుని జీవిస్తాయి. ఎకరానికి వీటిని నాలుగు వందల చెట్ల వరకూ నాటవచ్చని, పండ్లకు మంచిగిరాకీ ఉంటుందని పాండురంగయ్య చెప్పారు. పండ్ల నుంచి ఎండు అంజీరా కూడా తయారు చేయవచ్చని, తక్కువ శ్రమతో ఎక్కువ పంట పండిచ్చవచ్చని తెలిపారు. మామూలుగా వాడే ఎరువులకు తోడు కొద్దిగా నత్రజని ఒకటి రెండు సార్లు వేయటంవల్ల దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. సంవత్సరానికి ఒకసారి దిగుబడినిచ్చే అంజీర పెంపకంలో పండ్లతోటల సమాఖ్య సలహాదారు సుధాకరరావు సలహాలు పొందినట్లు చెప్పారు. పది అడుగులదూరంలో చెట్లు నాటాలని, సంవత్సరానికి ఒకసారి చెట్లను కత్తిరించటంవల్ల అధికదిగుబడి వస్తుందని తెలిపారు. అంజీర ప్రస్తుతం మన రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో కొద్దిగా సాగులోఉంది. అలాగే ఫాల్సా అనే పండ్లమొక్కలను కూడా పాండురంగయ్య తన పొలంలో నాటారు. ఇవి రెండు రెండు సంవత్సరాల కాలానికి పంటనిస్తాయి. కరవు జిల్లాలో పండించవగ్గ ఈ ఫాల్సాను మొదటి మూడునెలల వరకూ జాగ్రత్తగా చూసుకుంటే సరిపోతుంది. అంజీరపంట వివరాలు కావల్సినవారు రైతుల సలహాదారు సుధాకరరావును సంప్రదిస్తే సరిపోతుంది.